శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 15, ప్రభాతవార్త ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీకోసం.ఏపి.జీవోవి.ఇన్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చును. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నగరంలో పౌరసరఫరాల శాఖ గ్యాస్ సిలిండర్ల తనిఖీలు

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 15, ప్రభాతవార్త జిల్లా పౌర సరఫరాల అధికారి, నెల్లూరు వారు వారి యొక్క సిబ్బందితో పాటు, నెల్లూరు జిల్లాలోని పలు హోటళ్లు, దుకాణాలు, గ్యాస్ రీఫిల్లింగ్ యూనిట్లు వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సబ్సిడీతో అందజేసే గృహ వినియోగ ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లు వాణిజ్య అవసరాలకు అక్రమంగా ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై అధికారులు పంచనామా నిర్వహించి, వివిధ హోటల్స్, క్యాటరింగ్ సెంటర్స్ నందు ఈ రోజు 22 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను గుర్తించి సీజ్ చేసారు. ఇప్పటి వరకు జిల్లాలో 21 కేసులు నమోదు చేసి మొత్తం 141 గ్యాస్ సిలిండర్లు సీజ్ చేసి, సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్ద భద్ర పరచడం జరిగినది. సంబంధిత యజమానులపై నిత్యావసర సరుకుల చట్టం, 1955, 6(ఏ) సెక్షన్ ప్రకారం నెల్లూరు జాయింట్ కలెక్టర్ కోర్టులో నివేదిక సమర్పించేందుకు చర్యలు తీసుకొనడమైనది. తదుపరి జిల్లా పౌర సరఫరాల అధికారి నెల్లూరు వారి సిబ్బందితో కృష్ణా గ్యాస్ ఏజెన్సీ, ఐఒసిఎల్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్, నెల్లూరు ను తనిఖీ చేసి, వినియోగదారులకు సకాలములో గ్యాస్ డెలివరీ చేయవలెనని ఆదేశించడం జరిగింది. హోటళ్లు, దుకాణాలు, బార్ రెస్టారెంట్లు గృహ అవసరాలకు వినియోగించే డోమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించకూడదని అధికారులు, వ్యాపారులను హెచ్చరించారు.

నేడు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం

నెల్లూరు, మార్చి 15, ప్రభాతవార్త వైద్యం ఆదివారం విద్యుత్ భవన్ నందు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు నేడు సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల నుండి నేరుగా సమస్యలను స్వీకరించి, వాటిని సత్వరంగా పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 8.30గంటల నుండి 9.30గంటల వరకు వినియోగదారులు 0861-2320427 నెంబర్‌కు ఫోన్ చేసి తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు నేరుగా తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైసిపి జిల్లా అద్యక్షుడ్ని కలిసిన షేక్ షకిలా బేగం

బుచ్చి మార్చి 15 ప్రభాతవార్త జిల్లా వైసిపి మున్సిఫల్ విభాగం అద్యక్షురాలుగా నియమితులైన షేక్ షకిలా బేగం జిల్లా వైసిపి అద్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు తనపై అపార నమ్మకంతో ఈ బాద్యతలు అప్పగించిన జిల్లా అద్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతు పార్టీ వ్యవస్థాపకులు జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అణుగుణంగా, పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని ఆమె పేర్కున్నారు. 2029 లో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పూర్తి స్దాయిలో తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం వైసిపి టౌన్ అద్యక్షులు షేక్ షాహుల్, మైనార్టీ నాయకులు షేక్ అల్లాబక్ష్, సీనియర్‌నాయకులు కడివేటి శ్రీనివాసులురెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, అవినేష్‌రెడ్డి , డాక్టర్ అల్లాబక్ష్, నాయకులు, కౌన్సిలర్లు యానాదిరెడ్డి, బిట్రగుంట ప్రమీలమ్మ, తేజాలక్ష్మి, చిన్నలాబక్ష్, మైనార్టీ నాయకులు బాబు పాల్గోన్నారు.

ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి

- ఇష్టపడి చదివితే ఫలితాలు మీ వెంటే, టైమ్ సెన్స్ ప్రధానం, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శోభారాణి

కోవూరు, మార్చి 15 ప్రభాతవార్త : పదవ తరగతి విద్యార్థులు జరగనున్న పరీక్షల్లో ఎటువంటి భయాందోళనలు లేకుండా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగితే ఫలితాలు మీ వెంటే వస్తాయని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి శోభారాణి అన్నారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ బాల బాలికల వసతి గృహ సముదాయంలో ఆదివారం పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు వాచ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ప్రభుత్వం ద్వారా మౌలిక వసతులు ఏర్పాటు చేశామని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు ప్రస్తుతం పదవ తరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా మానసిక ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని పిలుపునిచ్చారు. ఒక ప్రశ్నకు ఎంత సమయం సరిపోతుందో సరి చూసుకుని తద్వారా జవాబులు రాయాలన్నారు.. ట్రస్టు ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్తును బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఇష్టపడి చదివితే తప్పక మంచి ఫలితాలు వస్తాయన్నారు. . ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ నరసింహమూర్తి మాట్లాడుతూ పరీక్ష పత్రాన్ని ఒకటికి రెండు సార్లు పూర్తిగా చదివి వచ్చిన ప్రశ్నలకే జవాబులను రాయాలని సూచించారు. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలనే ఉద్దేశంతో ట్రస్టు ద్వారా ఇటువంటి సామాజిక కార్యక్రమాలను గత నాలుగు సంవత్సరాలుగా నిర్వాహకులు నిర్వహిస్తూనే ఉన్నారన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా నూరుశాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు ఈ ట్రస్టు ద్వారా ఇప్పటికే నిర్వాహకులు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందుకు ట్రస్టు నిర్వాహకులు నాగార్జున, సత్యవతి దంపతులు , చైతన్య, శ్రావణి దంపతులు, వెంకటేశ్వర్లు, శివప్రియ దంపతులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఇటువంటి మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. సమయపాలన సాధించి నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు.. ఎంపీపీ టి. పార్వతి మాట్లాడుతూ జిల్లాలోనే పీఆర్ఎన్ పాఠశాలకు మంచి పేరు ఉందని, దానిని తిరిగి నిలబెట్టేలా విద్యార్థులు చొరవ తీసుకోవాలన్నారు. ఏఎస్‌డబ్ల్యూ తిరుపతయ్య మాట్లాడుతూ ఇటువంటి మంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన ట్రస్టు నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి తప్పక పాస్ అవుతాననే ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు హాజరు కావాలన్నారుముందుగా ఒకటికి రెండు సార్లు ప్రశ్నాపత్రాన్ని చదివి మనకు ఏ ప్రశ్నలు పూర్తిగా వస్తాయో అటువంటి వాటిపైనే దృష్టి పెట్టాలన్నారు. జవాబు పత్రాల మీద ఎటువంటి కొట్టివేతలు, దిద్దుడులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా జవాబు రాసే సమయంలో నిర్దిష్టమైన జవాబును తెలుసుకుని రాయాలని విద్యార్థులకు సూచించారు.. రాష్ట్ర సంక్షేమాధికారుల సంఘం అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాలను చేపడుతున్న ట్రస్టు నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు కావాలనే లక్ష్యంలో పరీక్షలు రాస్తే విజయం కలుగుతుందన్నారు.సంక్షేమాధికారులు ఆర్. పద్మమ్మ, సీహెచ్ మేరీ సుప్రజ,సుభాషిణి, నాగలక్ష్మి,బీసీ బాలికల వసతి గృహ సంక్షేమాధికారి సుమలత కార్యాలయ పర్యవేక్షకులు దయాకర్, ఏ. రవికుమార్‌లు పలు సూచనలు చేశారు. అనంతరం కోవూరు ఏఎస్‌డబ్ల్యూ పరిధిలోని మూడు మండలాల్లో ఉన్న 7 సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు ట్రస్టు ద్వారా వాచ్‌లను పంపిణీ చేశారు. . ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు హితేష్‌కుమార్, వేముల నిఖిల్,ు ఉన్నారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం, మార్చి 15, ప్రభాతవార్త : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 1138 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 62.988 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 700, పెన్నా డెల్టా 2000 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.466 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

ఘనంగా రాష్ట్ర ప్రభుత్వ ఇఫ్తార్ విందు

- హాజరైన ప్రజా ప్రతినిధులు, వేలాది ముస్లిం ప్రజలు

నెల్లూరు, మార్చి15, ప్రభాతవార్త-వైద్యం నెల్లూరు నగరంలోని కోటమిట్టలో గల షాదీ మంజిల్ నందు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సారథ్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేయర దేవరకొండ సుజాత, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహసీన్ ఇంతియాజ్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి హాజరయ్యారు. ముందుగా ముస్లిం సోదరులతో కలిసి ఉపవాసం విరమింపచేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ప్రజా ప్రతినిధులు నమాజ్ చదివారు. ముఖ్య అతిధులుగా హాజరైన ప్రజా ప్రతినిధులకు దివ్య ఖురాన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మంత్రి నారాయణ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి కడుతున్న ఇంటర్నేషనల్ స్కూల్ రాష్ట్రంలో మరొకటి లేదని, అబ్దుల్ అజీజ్ కసుమూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఉచిత అన్నదానం ప్రారంభించారని అజీజ్ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అయిన తర్వాత ముస్లింలకు ఎన్నో విధాలు మంచి జరిగిందని తెలిపారు. చిన్ననాటి నుండి ముస్లింల మధ్యనే పెరిగామని గుర్తు చేసుకున్నారు. శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన ప్రతి సారి ఇఫ్తార్ విందు ఆనవాయితీగా చేస్తూనే ఉంటామని అన్నారు. ప్రపంచం మొత్తం యుద్ధ వాతావరణంలో ఉందని ప్రపంచ శాంతి కోసం మీరు చేస్తున్న ప్రార్థనలు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. మీ ప్రార్థనలో మీ ఆశీస్సులు చంద్రబాబునాయుడుకు ఉండాలని కోరారు. టీడీపీ ముస్లింల పక్షపాతి అని మైనార్టీ అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు. రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లిం సోదర సోదరీమణులు నిష్టాగరిష్టలతో ఉండే ఉపవాసాలు సర్వమానవాళికి మేలు చేస్తాయని తెలిపారు. కార్యక్రమానికి ఆహ్వానించిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు ధన్యవాదాలు. ముస్లింలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ముస్లిం సోదరునికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనార్టీల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. మన భారతదేశం సర్వ మతాల సమ్మేళనమని, మన దేవుళ్ళు వేరైనా మనం కలిసి మెలిసి ఉంటామని తెలిపారు. నెల్లూరు జిల్లాకు ఎన్నో పరిశ్రమలు రాబోతున్నాయని అన్నారు. అబ్దుల్లా ముస్లిం కోసం ఎంతో శ్రమిస్తున్నారని వారి ఉన్నత చదువులకు ఎంతో ఉన్నతంగా ఆలోచిస్తున్నారని అందరిని ఉన్నతంగా చదివించాలని కోరారు.

లక్ష ఉద్యమ సభ్యత్వాల నమోదు లక్ష్యం - అజయ్‌కుమార్

ఆత్మకూరు, మార్చి 15, ప్రభాతవార్త : ఆత్మకూరు పట్టణంలో ఆదివారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేములపాటి అజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 50వేలకు పైగా ఉద్యమసభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. ఈసంఖ్యను లక్షకు చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలన్నారు. జనసేన పార్టీ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ ప్రజల్లో పార్టీని మరింత బలోపేతం చేయడం , ప్రజల సంక్షేమంకోసం ఉద్యమం సాగించాలనే ఉద్దేశంతోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరిని "ఉద్యమి"గా పిలుస్తు సమాజంలో మార్పుకోసం సమసమాజం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమకారులుగా ముందుకు రావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటంరెడ్డి స్పీడ్‌కు సరితూగేవారు లేరు

ఎమ్మెల్యే సోమిరెడ్డి, రామకోటయ్య నగర్‌లో రూ.1.85 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

నెల్లూరు రూరల్ మార్చి 15 ప్రభాతవార్త నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 31వ డివిజన్ రామకోటయ్య నగర్ సెంటర్‌లో రూ.1 కోటి 85 లక్షలతో 28, 29, 30, 31 డివిజన్లలో పూర్తయిన వివిధ అభివృద్ధి పనులకు నేడు ఉదయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఆనందంగా ఉందన్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పనిచేసే వేగాన్ని ఎవ్వరూ అందుకోలేరని ప్రశంసించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధికి సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని, తట్టెడు మట్టిని కూడా రోడ్లపై వేయలేదని విమర్శించారు. కానీ ఇప్పుడు నెల్లూరు రూరల్‌లో రోడ్లు సుందరంగా మారుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పనులకు నిధులు సాధించడంలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దిట్ట అని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ముఖ్యంగా మూడు ఫేజ్ కరెంటు పనులు రాష్ట్రంలో ఎక్కడా జరగని స్థాయిలో నెల్లూరు రూరల్‌లో జరిగాయని అన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తన శ్వాస, ధ్యాస మొత్తం నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమే అయినప్పటికీ, ఎన్నికలు లేని సమయంలో అందరూ కలిసి అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం తన లక్ష్యమని చెప్పారు. ఎమ్మెల్యే ఎలా ఉండాలో పది కాలాలు చెప్పుకునేలా పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అభివృద్ధి కోసం అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలని ఆయన కోరారు. 2029 ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10కి 10 అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంటు స్థానాన్ని గెలిచేలా కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, కోక్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ యువమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కాసా బాలాజి

బుచ్చి మార్చి 15 ప్రభాతవార్త భారతీయ జనతా యువమోర్చ ఆద్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన కాసా బాలాజిని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్బంగా స్నేహితులు,జనతా యువ మోర్చ కార్యకర్తలు కేక్ కట్ చేసి బాణా సంచాను కాల్చి బాలాజిని ఘనంగా సన్మానించారు.

పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి ఎంఇఒ నరేష్‌కుమార్

మనుబోలు మార్చి 15 ప్రభాతవార్త మనుబోలు లోని బాలికల ,బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి పి.నరేష్‌కుమార్ పరిశీలించారు. విద్యార్థులకు ఏ అసౌకర్యం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు తగిన ఏర్పాట్లు చేసేమన్నారు. పరీక్షా గదులలో ఫ్యాన్లు లైట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలోని మనుబోలు బాలుర బాలికల హైస్కూళ్ళు వీరంపల్లి,అక్కంపేట, మడమనూరు, బద్దెవోలు హైస్కూలు నుండి 208 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. బాలుర హైస్కూల్‌లో 109 మంది,బాలికల హైస్కూల్‌లో 99 పరీక్షలు రాయనున్నారని ఆయన వివరించారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. సమీపంలోనే జెరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. ఆయన వెంట చీఫ్ సూపరిండెంట్ లక్ష్మీనారాయణ, డివో రాజేష్ ఉన్నారు.

పవన్ ఆశయాలకు సొంత పార్టీ నాయకులే అడ్డుకట్ట వేయటం దారుణం

-ఆత్మకూరు సంఘటనలో సొంతపార్టీ నాయకులే దాడికి యత్నించటం సిగ్గుచేటు

-సాక్షాలను, నిజానిజాలను పార్టీ పెద్దలకు తెలియజేస్తాం

-వేములపాటి ఆజయ్ ఆధ్వర్యంలో ఉద్యమంలా ఉద్యమి నమోదు ప్రక్రియ

-విలేకరుల సమావేశంలో జనసేన నాయకుల వెల్లడి

నెల్లూరు, మార్చి 15, ప్రభాతవార్త-విద్య : జనసేనాని ఆయశయాలకు సొంత పార్టీ నాయకులే అడ్డుకట్ట వేసేలా చేయటం, జిల్లాలో జనసేన పార్టీ కోసం ఆరోగ్యం సహకరించకున్న పవన్‌కళ్యాణ్ సూచలనలతో అన్నీ తానై చూసుకుంటూ ఉద్యమి నమోదు ప్రక్రియను ఉద్యమంలా చేపడతన్న వేములపాటి అజయ్‌కుమార్ పై దాడికి యత్నించటం సిగ్గుచేటని జనసేన పార్టీ నాయకులుపేర్కొన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక గోమతి నగర్‌లోని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకులకిషోర్, కోర్ కమిటి సభ్యులు నూనెమల్లిఖార్జునాదవ్‌లు మాట్లాడుతు గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర టిడ్కో చైర్మన్, జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ నాయకత్వంలో నెల్లూరుతోపాటూ ఆత్మకూరులో ఉద్యమి సభ్యత్వ నమోదును ఉధృతంగా చేపడుతున్నామన్నారు. ఇందులో బాగంగా స్థానిక నాయకులు చెదలవాడ హరీష్ ఆద్వర్యంలో ఆత్మకూరులో నిర్వహించిన ఉద్యమి కార్యక్రమంలో పాల్గొనేందుకు వేములపాటి అక్కడికి రావటం జరిగిందన్నారు. అజయ్ స్ఫూర్తితో స్థానికులు 300కుపైగా సభ్యత్వ నమోదును చేపట్టారని పేర్కొన్నారు. ఆదిపత్య దోరణిలో సొంతపార్టీ నాయకులే ఈ సబ్యత్వ నమెదును అడ్డుకునేయత్రం చేసి పార్టీ అధినేత ఆశయాలకు తూట్లు పొడిచేలా నడుచుకున్నారని, కార్యక్రమంలో దాడికి పాల్పడిన వచ్చిన వారిని భయబ్రాంతులకు గురిచేశారన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పనిన్నా గోడవలు సృష్టించినా తాము మాత్రం మెక్కవోని దీక్షతో సభ్యత్వ నమెదును పూర్తి చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో 50వేలకు పైగా నమెదును చేపట్టామని, ఇందులో వేములపాటి పాత్ర కీలకమన్నారు. ఆర్యోగం సహకరించకున్నా, సొంత జిల్లా నెల్లూరును జాగ్రత్తగా చూసుకోండి అన్నపవన్‌కళ్యాణ్ మాటలతో వేమలపాటి జిల్లాకు వచ్చి లక్ష్య ఉద్యమి సభ్యత్వాలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ఉదయగిరి లాంటి చిన్న ప్రాంతంలో కూడా ఒకే ఊరునుండి 300కుపైగా సభ్యత్వాలు నమోదు చేసిన ఘనత వేములపాటికి దక్కుతుందని కొనియాడారు. అంతటి నాయకునిపై దాడికి పాల్పడే చర్యలు చేయటం దారుణమని, ఈ ఘటనలకు సంబందించిన పూర్తి సాక్ష్యాలను పార్టీ అధినేత దృష్టికి తీసుకువెలతామని తెలిపారు. అందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రజలకు సేవ చేయటమేవేములపాటి లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నాయకులు చెదలవాడ హరీష్, నాయకులు చిట్టమూరు ప్రవీణ్‌రెడ్డి, అధికార ప్రతినిధి కారంపూడి కృష్ణారెడ్డి, పప్పునారాయణ, శ్రీరాం, గుర్రం కిషోర్‌బాబు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసుల పట్ల పోలీసులు కఠినంగా ఉండాలి : కాకాణి

నెల్లూరు రూరల్ మార్చి 15 ప్రభాతవార్త డ్రగ్స్ సేవిస్తూ తెలంగాణ పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన తెలుగుదేశం పార్టీ ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌తో లోక్‌సభ సభ్యత్వానికి తక్షణమే రాజీనామా చేయించాలని వైయస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మహేష్‌యాదవ్ మీద ఏ చర్య తీసుకోకుండా ఉంటే, యువత డ్రగ్స్ తీసుకోవాలని స్వయంగా సీఎం చంద్రబాబు సందేశం ఇచ్చినట్లే అని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలా చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్న మహేష్ యాదవ్‌ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించకూడదని, సామాన్యులకు విధించే శిక్షలకన్నా కఠినమైన శిక్షలను ఆయనకు అమలు చేయాలని నెల్లూరులో మీడియాతో మాట్లాడిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి తేల్చి చెప్పారు. ప్రెస్‌మీట్‌లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే..:డ్రగ్స్ పార్టీని అరేంజ్ చేసిందే మహేష్ యాదవ్:

టీడీపీ అంటే తెలుగుదేశం పార్టీ అనడం కన్నా, చంద్రబాబు, లోకేష్ నేతృత్వంలో అచ్చం తెలుగు డ్రగ్స్ పార్టీ అనేలా మారిపోయింది. టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ డ్రగ్స్ పార్టీలో పాల్గొనడమే కాకుండా డ్రగ్స్ టెస్టులో ఆయనకి పాజిటివ్ గా నిర్ధారణ అయ్యిందని తెలంగాణ ఈగల్ టీం ఎస్పీ స్వయంగా ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. రాజస్థాన్‌కి చెందిన మాజీ ఎమ్మెల్యే నితీశ్‌శర్మతో కలిసి టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఈ డ్రగ్స్ పార్టీని అరేంజ్ చేసినట్టు పోలీసులే చెబుతున్నారు. అంతే కాకుండా పార్టీ జరుగుతున్న ఫామ్ హౌస్ మీద ఈగల్ టీమ్ పోలీసులు రైడ్‌కి వెళ్లినప్పుడు, ఎంపీ వారిపైకి కాల్పులకు ప్రయత్నించడాన్నది మరో పెద్ద అభియోగం. పవిత్రమైన పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న వ్యక్తి డ్రగ్స్ సేవిస్తూ దొరకడం మన తెలుగు ప్రజల దౌర్భాగ్యం అనుకోవాలా? ఇలాంటి వ్యక్తికి ఎంపీగా కొనసాగే హక్కు లేదు. తక్షణమే ఆయనతో ఎంపీ పదవికి రాజీనామా చేయించడమే కాకుండా తెలుగుదేశం పార్టీ నుంచి కూడా సస్పెండ్ చేయాలి. డ్రగ్స్ కేసుల పట్ల పోలీసులు కఠినంగా ఉండాలి: టీడీపీలో సీనియర్ నాయకుడైన పుట్టా సుధాకర్ యాదవ్ కొడుకే ఈ పుట్టా మహేష్ యాదవ్. అంతే కాకుండా ఆయన గతంలో టీటీడీ చైర్మన్‌గా కూడా పని చేశాడు. చంద్రబాబు వద్ద మంచి పలుకుబడి, పరపతితో తప్పించే ప్రయత్నాలు మొదలయ్యాయి అనేది మా వద్ద ఉన్న సమాచారం. అదే జరిగితే యువతకి తప్పుడు సందేశం ఇచ్చినట్టవుతుంది. పోలీసులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి. ఆయన చేసిన తప్పుకి కఠినంగా శిక్షించాలి. పక్క రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ పరువు తీసిన ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ని ఉపేక్షించాల్సిన పని లేదు. డ్రగ్స్, గంజాయి, మద్యం మత్తులో మహిళలపై జరుగుతున్న నేరాలు ఎక్కువైపోతున్నాయని సర్వేలు చెబుతున్నాయి. అందుకే ఈ కేసుల్లో దొరికిన వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో డ్రగ్స్‌ని పూర్తిగా నిషేధిస్తామని చెప్పిన చంద్రబాబు రెండేళ్లవుతున్నా అరికట్టకపోగా తన పార్టీ ఎంపీలే నేరుగా డ్రగ్స్ సేవించే దుస్థితికి తీసుకొచ్చారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆక్షేపించారు.

అక్షరాంధ్రతో అతివల జీవితాల్లో వెలుగు

విడవలూరు, మార్చి 15 ప్రభాతవార్త: ప్రభుత్వం 1559 ఏళ్ల నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో అక్షరాంధ్ర (ఉల్లాస్) పరీక్షల నిర్వహణలో భాగంగా ఆదివారం మండలంలో పలు పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.మహిళలు ఆసక్తిగా పాల్గొని పరీక్షలు రాశారని, వాలంటీర్లు స్వచ్ఛందంగా శిక్షణ ఇచ్చారని స్థానిక ఎంపీడీవో నగేష్ కుమారి పేర్కొన్నారు. నిరక్షరాస్యుల కోసం మండలంలో ప్రత్యేక పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, కుర్చీలు వంటి వసతులు కల్పించామన్నారు. జరిగిన పరీక్షలు విజయవంతంగా సాగాయని ఎంపీడీవో తెలియజేశారు.

చేజర్లలలో బిజెపి ప్రశిక్షణ మహాభియాన్ తరగతులు ప్రారంభం

చేజర్ల మార్చి 15 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజి ప్రాంగణంలో ఆదివారం చేజర్ల మండలం భారతీయన జనతాపార్టీ పండిట్ దీనదయాళ్ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమాన్ని బిజెపి నాయకులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మొదట వందే మాతరం గీతాలాపనతో మొదలు పెట్టారు. అనంతరం భారతీయ జనతాపార్టీ నాయకులు మాట్లాడుతు ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమంలో ముఖ్య ఉద్దేశం భారతీయ జనతాపార్టీ సంస్దాగతం సిద్దాంతాలు పార్టీ బలోపేతం దిశగా ఏ విధంగా ముందుకు వెళ్లాలో ఆ ప్రణాళికలు ప్రకారం శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. అందుకు అణుగుణంగా చేజర్ల మండలంలోని విజ్ఞాన్ కళాశాల ప్రాంగణంలో చేజర్ల మండల బిజెపి అద్యక్షులు ఆద్వర్యంలో ఈకార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిదిగా భారతీయ జనతాపార్టీ నెల్లూరు జిల్లా కమీటి ఎగ్జిక్యూటివ్ మెంబర్ అల్లంపాటి రంగారెడ్డి, పాల్గొన్నారు. బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు బత్తల కృష్ణయ్య, మండల అద్యక్షులు గుండా విజయభాస్కర్‌రెడ్డి .బిజెపి జిల్లా నాయకులు మండల పార్టీ కమీటి మెంబర్లు, కార్యకర్తలు పాల్గోన్నారు.

పేరుకు ఒంటిపూట బడులు..ఎండల్లోనే విద్యార్ధులు

కావలి, మార్చి 15, ప్రభాతవార్త : ప్రతి ఏడాది వలనే ఒంటి పూట బడులు మార్చ్ 16 సోమవారం నుండి ప్రారంభం అవుతాయని పదవతరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాలుగా వున్న పాఠశాలల్లో ఆరు నుండి తోమ్మిది తరగతుల విద్యార్ధులకు మధ్నాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 5.30 దాకా తరగతులు నిర్వహిస్తారని కావలి విశ్రాంత ప్రధానోపాధ్యాయిని సి. శారద ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె తెలియజేస్తూ విద్యార్ధులకు పేరుకు మాత్రమే ఒంటి పూట బడులని మండుటెండలో విద్యార్ధులు పాఠశాలలకు వెళ్లి తరగతి గదుల్లో పదవతరగతి పరీక్షల కోసం టేబుల్స్ మీద అభ్యర్ధుల పరీక్షా నెంబర్లు వేసి వుంటారు కాబట్టి తరగతి గదుల్లో బెంచీల మీద కూర్చుని పాఠాలు వినడానికి అవకాశం వుండదన్నారు. పాఠశాల ఆవరణలో నీడ వున్న చోట కూర్చోని, పాఠాలు వినాల్సి వస్తుందన్నారు. మధ్నాహ్నం భోజనం, కోసం 12.30కే ఎండలో పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి విద్యార్ధులు 12.30కు మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత ఇంటికి వెళ్లాల్సి వుంటుందన్నారు. ఎటు చూసినా పేరుకు మాత్రమే ఒంటి పూట బడులు విద్యార్ధులు ఎండల్లో మండాల్సి న పరిస్థితి విద్యార్థు ఆరోగ్యానికి హనికరం అన్నారు. ఈ పరీక్షలు పూర్తయ్యేదాక పరిక్షా కేంద్రాలు వున్న పాఠశాల విద్యార్ధులు ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. విద్యాశాఖ, ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి విద్యార్ధులను ఎండలకు బలి కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి

కావలి, మార్చి 15, ప్రభాతవార్త : సమాజంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోని రక్షణ పోందాలని లోకసత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. మాలకోండా రెడ్డి కోరారు. మార్చి 15 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మాలకోండా రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోరకు చట్టాలు వచ్చి మూడ దశాబ్దాలు దాటినా అధికారులు అలసత్వం వలన ఇప్పటికీ వినియోగదారులు మోసపోతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా తూకాలలో తేడాలు, కల్తిల జోరు, ధరలలో వ్యత్యాసం వలన వినియోగదారులు నిలువునా మోసపోతున్నారని తెలిపినారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని వినియోగదారునికి నాణ్యమైన వస్తువులు అంది అధికారులలో అవినీతి తగ్గుతుందని తెలిపారు. వినియోగదారులు హక్కులతో పాటు భాద్యతలు కూడా తెలుసుకుని అన్యాయాలను అవినీతిని ప్రశ్నించినప్పుడే వినియోగదారుల రక్షణ చట్టం ప్రయోజనాలు ప్రజలకు అందుతాయిని తెలిపారు. ప్రతి వినియోగదారుడు వస్తువులను కోనేటప్పుడు రసీదులను తీసుకోవాలని కోరారు. నష్టపోయిన వినియోగదారులు ఫోరమ్‌లో ఫిర్యాదు చేసి నష్టపరిహారం పోందవచ్చాన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసి వినియోగదారులను చైతన్యపరిచి వినియోగదారుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి కృషి చేయాలని కోరారు.

నృసింహుని నిత్యాన్నదానానికి రూ. 1లక్ష విరాళం

రాపూరు, మార్చి 15, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్య అన్నదానానికి ఆదివారం స్వామి వారి భక్తులు రూ. 1 లక్ష విరాళాన్ని ఆలయ సిబ్బందికి ఆందజేశారు. నెల్లూరు జిల్లా, అనంతసాగరం వాస్తవ్యులు బట్రెడ్డి వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్ధం వారి వారసులు అక్క లక్ష్మీ ప్రసన్న, తమ్ముడు శ్రీధర్ రెడ్డిలు ఒక లక్ష రూపాయిల విరాళాన్ని నగదు రూపంలో ఆందజేశారు. స్వామి వారి అన్నదానానికి విరాళం అందజేసిన దాతలకు ఆలయ సిబ్బంది వారికి శ్రీవార్ల ప్రత్యేక దర్శనం, స్వామి వారి శేష వస్త్రములు,తీర్ధ ప్రసాదాలను ఆందజేశారు. ఈ కార్యక్రమంలో దేవ స్థానం సిబ్బంది వెంకటసుబ్బయ్య, హరిష్, పోలయ్య తదితరులున్నారు.

నేటి నుండి పదవ తరగతి పరిక్షలు మూడు కేంద్రాలలో 489 విద్యార్ధులు

రాపూరు, మార్చి 15, ప్రభాతవార్త : పదవ తరగతి పరిక్షలు సోమవారం నుండి జరగనున్నాయని రాపూరు మండల విద్యాశాఖాధికారి గుండవోలు శ్రీనివాసులు తెలిపారు.ఉదయం9.30 నుండి మద్యాహ్నం 12.30 వరకు ఈ పరిక్షలు వుంటాయని తెలిపారు. రాపూరు మండలంలో మొత్తం 3 పరిక్షా కేంద్రాలు వున్నాయని వీటిలో రాపూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో 232 మంది, రాపూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో 90 మంది, కండలేరుడ్యాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 110 మంది విద్యా ర్ధులు పరిక్షలను వ్రాయనున్నట్లు యంఇఒ శ్రీనివాసులు తెలిపారు.

వంద శాతం అక్షరాస్యతే లక్ష్యం

సీతారామపురం మార్చి 15 ప్రభాతవార్త : ప్రతి గ్రామంలో వంద శాతం అక్షరాస్యత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపిడిఒ వై శివప్రసాద్‌రావు తెలిపారు. ఈ పథకం కింద 2029 నాటికి రాష్ట్ర ంలో వంద శాతం అక్షరాస్యత సాధిం చడమే లక్ష్య ంగా నిర్దేశిం చికుంద న్నారు. ఇందులో భాగంగా 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబం దించి పునాది అక్షరాస్యత సాంఘిక శాస్త్రం, మూల్యాంక పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకంగా విడుదల చేసిందని అన్నారు. ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని మెప్మా సిబ్బందితో కలిసి నిర్వహిస్తున్నామని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించి బడిన లక్షలాది మంది అబ్యాసకులుఈ మూల్యాంకన ప్రక్రియలో పాల్గొన్నారని అన్నారు. ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతను జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వయోజన విద్యాశాఖ స్వీకరించిందని అన్నారు. అందులో భాగంగా సీతారామపురంలోని బిట్ -2 పరిధిలోని ఎంపిపి ఎస్ స్పెషాలటి స్కూల్‌ని విజిట్ చేసి పరీక్షా కేంద్రం నందు తగు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్, డిఆర్‌డిఎ వెలుగు సిసి ,విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి చేయూతనిచ్చిన పద్మశాలి యువసేన

నెల్లూరు, మార్చి 15, ప్రభాతవార్త-విద్య : నారాయణరెడ్డి పేటకు చెందిన చేనేత కార్మికుడు గుండా శ్రీనాథ్ గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతూ కు టుంబ పోషన బారమై ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు.విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ పద్మ శాలి యువసేన సామాజిక మాద్య మాల ద్వారా స్పందించి 90వేల రూపాయలను సేకరించారు.ఈ మోత్తాన్ని ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతు గత నాలు గేళ్లగా పద్మశాలి కులంలో బాధితులను ఆదుకోవటంలో యువసేన చేస్తున్న కృషి స్పూర్తిదాయకమన్నారు. పక్షవాతానికి గురై, తన ఇద్దరు కుమార్తెలు, బార్య, వృద్ధ తల్లిదండ్రుల పోషణకై ఇబ్బందులు పడుతున్న శ్రీనాథ్‌ను ఆదుకోవటం సంతోషంగా ఉందని భవిష్యత్‌లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి యువసేన రాష్ట్ర ప్రతినిధులు గోలి వంశీకృష్ణ, మునగపాటి రమేష్, కారెంపూడి దయాకర్, శ్రీనివాసరావు, బాలాజీ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసకుమార్, వెంకటసుధాకర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నం సిఐగా రఘుబాబు బాధ్యతలు స్వీకరణ

ముత్తుకూరు, మార్చి 15, ప్రభాతవార్త : కృష్ణపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా రఘుబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుండి బదిలీ పై నెల్లూరు జిల్లాకు రావడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకు రావడం కృష్ణపట్నం సిఐగా తొలి పోస్టింగ్ అన్నారు. సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో శాంతి భద్రతలు కాపాడడానికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. మండలంలోని రౌడీ షీటర్లు కదలికలను నిత్యం గమనిస్తుంటామని, జాగ్రత్తగా ఉండాలని షీటర్లను హెచ్చరించారు. ముత్తుకూరు ఏఎస్ఐ తిరుపాలు, పోలీసు సిబ్బంది, తదితరులు సిఐ రఘుబాబుకు శుభాభినందనలు తెలిపారు.

సిఐ రఘుబాబును సత్కరించిన టిడిపి మండలాధ్యక్షులు నీలం

ముత్తుకూరు, మార్చి 15, ప్రభాతవార్త : ముత్తుకూరు మండలం కృష్ణపట్నం సర్కిల్ సిఐగా బాధ్యతలు చేపట్టిన నూతన సిఐ రఘుబాబును టిడిపి మండలాధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసారు. ఈ సందర్భంగా సిఐని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శాం తి భద్రతల పరిరక్షణలో తాము కూడా పోలీస్ అధికారులకు అధికార పార్టీ నాయకులుగా తోడ్పాటును అందిస్తామని తెలిపారు.

ముత్తుకూరులో ముందస్తు రంజాన్ వేడుకలు

- ముఖ్య అతిధిగా హాజరైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

ముత్తుకూరు, మార్చి 15, ప్రభాతవార్త: మండల కేంద్రమైన ముత్తుకూరులో ముస్లిం సోదరులు ముందస్తు రంజాన్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు తనను ఈ వేడుకలకు ఆహ్వానించడం సంతోషదాయకమని, ఆనవాయితీ అన్నారు. రంజాన్ దయాగుణం, దానగుణం, శాంతి వంటి అంశాలతో పాటు దేహ దారుడ్యాన్ని క్రమబద్ధీకరించుకోవడానికి రంజాన్ పండుగ ఒక చక్కని ఉదాహరణని తెలిపారు. గతంలో ముస్లిం సోదరులకు దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి ముస్లింల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమారుదైన వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ ముస్లింల కోసం పలు పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యంగా ముత్తుకూరులోని ముస్లిం సోదరులు తనను కలిసి స్మశానంకు ఏర్పాటుకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరారన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో అప్పటి ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి స్మశానం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించడం జరిగిందని తెలిపారు. దీంతో ముస్లిం సోదరుల స్మశానవాటిక ఆక్రమణలకు గురి కాకుండా కాపాడమన్నారు. ముస్లిం సోదర సోదరీమణులు సంతోషంగా రంజాన్ పండుగను జరుపుకోవాలని సూచించారు. ముస్లిం పెద్దలు, మండల కన్వీనర్ మెట్ట విష్ణు వర్ధన్ రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, వెంకట శేషయ్య, రహీం, నవీద్ భాషా, దువ్వూరు తేజ రెడ్డి, అగ్ని, కట్ట సుబ్రహ్మణ్యం, ఆలపాక శీనయ్య, బ్రహ్మానందం, గోపాల్, అశోక్ రెడ్డి, వసంత కుమార్ రెడ్డి, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లింలకు తోఫా పంపిణీ

పొదలకూరు, మార్చి 15, ప్రభాతవార్త : పట్టణంలోని విఘ్నేశ్వర కాలనీలో ఉన్న మసీదులో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లింలకు రంజాన్ తోఫా (చక్కెర,రాగి పిండి, గోధుమపిండి, సెమి యా, నూనె, చీరలు, లుంగీలను ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు షేక్ నౌరాజ్ పంపిణీ చేశారు. రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు పాటిస్తూ, పేదలకు దానం చేయడం, సహాయం చేయడం, పరస్పర సౌహార్ద్రాన్ని పెంపొందించడం ఎంతో గొప్పదిగా భావిస్తారన్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన వారికి సహా యం చేయడం ఎంతో సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొదలకూరు ఎస్సై హనీఫ్ ముస్లిం మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ రంజాన్ నెలలో దానం చేయడం గొప్ప సత్కార్యమని అన్నారు. తన వంతు సహాయంగా ఒక్కొక్క మహిళకు రూ.500 చొప్పున అందజేశానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు జమీర్, సెక్రటరీ అహ్మద్, రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి ,సాంప్రదాయాలను కాపాడాల్సిన బాద్యత అందరిపైన ఉంది

కలువాయి మార్చి 15 ప్రభాతవార్త : మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాల్సి న బాద్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ప్రపంచ శాంతికి హిందువుల ఐక్యత భారతదేశ ఉన్నతి ఎంతో అవస రమని కలువాయి హిందు ధర్మ పరిరక్షణ సమితి సమరసతా సేవా పౌండేసన్ సభ్యులు పేర్కున్నారు. మండలంలోని పర్లకొండలోని అరుంధయ కాలనీలో శ్రీ మాతమ్మ దేవస్థానం నందు ఆదివారం వైష్ణవ ఏకాదశి సందర్భంగా 108 మంది స్త్రీమూ ర్తులతో సామూహిక లక్ష్మీనారాయణ పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి భగవద్గీత, గ్రంధాన్ని సమిత సభ్యులు అందజేశారు. గీతా గ్రంధాన్ని చదవడం ప్రతి ఒక్కరు అలవరచుకోవాలని ప్రతి ఒక్కరు గ్రామ దేవతలను ఆరాధన చేయా లని తెలిపారు. గ్రామాలు సుభిక్షంగా ఉంటాలంటే గో రక్షణ,గో ఆరాధన చేయాలని సమితి సభ్యులు మాట్లా డారు. అమ్మవారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారు మ్రోగింది.ఈకార్యక్రమంలో సమరసతా సేవా పౌండేషన్ హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు ప్రసాద్,శివకుమార్, ధర్మ ప్రచారక్ మల్లికా ర్జున, విశ్వ నాద్‌రెడ్డి,కృష్ణయ్య ప్రసన్నకుమార్,గ్రామస్తులు పెంచలయ్య, వెంకటేశ్వర్లు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చేజర్ల మండలంలో 10 వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చేజర్ల మార్చి 15 ప్రభాతవార్త : చేజర్ల మండలంలో సోమవారం నుండి ప్రారంభం అయ్యే పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భ ంగా చేజర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ ఏ సెంటర్‌లో 165 మంది,బి సెంటర్‌లో 136 మంది విజ్ఞానాన్ జూనియర్ కాలేజి కేంద్రంలో 105 మందికి పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. మండల ంలోనిమూడు పరీక్షా కేంద్రాలలో ప్రభుత్వ,ప్రవేటు పాఠశాల విద్యార్ధులు మొత్తం 406 మంది విద్యార్ధులు పరీక్షలు వ్రాయ నున్నారు, చేజర్ల,టికె పాడు,తూర్పుపల్లి, మాముదూరు నాగుల వెలటూరు, ఆదూరుపల్లి, దాచూరులలోని జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్ధులతో పాటు ప్రవేటు పాఠశాలలు లుంబిని విద్యాలయం ,మానసా త్రికోటేశ్వర ప్రవేటు విద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరౌతున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబందిత అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్ధుల కోసం త్రాగునీరు, అవసరమైన సౌకర్యాలు,భద్రతా ఏర్పాట్లు కల్పించడంతోపాటు ప్రశాంత వాతరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్దులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకొని పరీక్షా నియమాలు పాటిస్తు ప్రశాంతంగా పరీక్షలు వ్రాయలని మండల విద్యాశాఖ అధికారులు సూచించారు.

కలువాయిలో కాన్షిరామ్ జయంతి వేడుకలు

కలువాయి మార్చి 15 ప్రభాతవార్త: ఏడిపిఎస్ ఆద్వ ర్యంలో కాన్షిరామ్ జయంతి వేడుకలను ఆదివారం ఏడి పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్ ఆద వ్యర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.భారతదేశంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ తదతనంతరం అంబే ద్కర్ సిద్దాంత పునాదిమీద బల మైన స్వతంత్రమైన రాజకీయ ఉద్యమాన్ని నిర్మించిన ఏకైక వ్యక్తి కాన్షిరామ్ అని నిజమాల ప్రసాద్ కొనియాడారు. టిడిపి మండలఆర్గనైజింగ్ సెక్రటరీ కసిరెడ్డి ప్రేమ్‌కుమార్, బిటిఏ నాయకులు పెంచలరావు,నాగేశ్వరరావు,ఏడిపిఎస్ మండల నాయకులు సోకారమణయ్య,సల్మాన్ శేఖర్, ఎం రమణయ్య,దొరబాబు, ఎస్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

కావలి, మార్చి 15, ప్రభాతవార్త: నేటి నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు కావలి మండల విద్యా శాఖ అధికారులు బి. గోవిందయ్య, సి.హెచ్. వెంకటసుబ్బయ్యలు తెలిపారు. ఆదివారం పరీక్షా కేంద్రాలను వారు పరిశీలించి మాట్లాడుతూ కావలి మండలంలో మొత్తం 13 సెంటర్లలో 1037 మంది విద్యార్ధులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. విద్యార్ధుల ప్రయోజనార్థం డ్రింకింగ్ వాటర్, ఎలక్ట్రిసిటీ, బెంచీలు, ఫ్యాన్లు తదితర వసతులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్,సూపరిండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారని వెల్లడించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఐదు నిమిషాల ముందుగా, ఇంటర్నెట్లో డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్లతో చేరుకోవాలన్నారు.

89మంది విద్యార్ధులకు విద్యాప్రోత్సాహకాల పంపిణీ

నెల్లూరు,మార్చి15 ప్రభాతవార్త విద్య : ఆదివారం నగరంలోని స్థానిక తిప్పరాజు వెంకట సుబయ్యసత్రం ఆధ్వర్యంలో 89మంది విద్యార్దులకు విద్యాప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిధులుగా ఫౌండర్,ట్రస్టీ డాక్టర్ సర్వే పల్లి అజయ్ కుమార్, మాజీ కార్పోరేటర్ ఉచ్చి బువనేశ్వరి ప్రసా ద్‌లు పాల్గొని ప్రోత్సాహకాలను విద్యార్దులకు అందజేశారు. వారు మాట్లాడుతు చదువుల్లో ఉన్నత మార్కులు సాధించిన వారికి మరింత ప్రోత్సహించాలని ప్రతి ఏటా చేపడుతు న్నామన్నారు. ప్రస్తుతం రూ.810000 నగదును విద్యార్దులకు ప్రోత్సాహకాలుగా అందించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల సమితి అధ్యక్షులు గుడ్లదేవన్ వాసుదేవరావు, మేనేజింగ్ ట్రస్టీ దేశబొట్ల ఫణిరత్నం, ట్రస్టీలు రాఘవేంద్రరావు, సర్వేపల్లి పరాసర్, నాగదేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పూజారులకు ఘన సత్కారం

గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మార్చి 19వ తేదీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవ స్థానం ఆవరణంలో ముగ్గురు పూజారి దంపతులకు ఉగాది సత్కారంఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆనవాయితీగా ప్రతి ఉగాదికి బ్రాహ్మణ పూజారి దంపతులకు సత్కారాలు చేయడం జరుగుతుందని అందులో భాగంగానే ప్రతి సంవత్సరం ముఖ్య అతిథిగా డాక్టర్ రోహిణి చేతుల మీదగా నిర్వహిస్తున్నారని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కుటుంబ సభ్యులు, పురోహితుడు అనంత ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నెల్లూరు క్రైమ్, మార్చి 15, ప్రభాతవార్త ; నెల్లూరు జిల్లా విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికా రులు, సివిల్ సప్లైస్ అధికారుల సమన్వయంతో కలిసి నెల్లూరు జిల్లా లోని వివిధ హోటళ్లు, క్యాటరింగ్ సెంటర్లలో మొత్తం ఐదు చోట్ల రెండో రోజైన ఆదివారం కూడా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో సబ్సిడీతో అందించే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించి మొత్తం 22 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ. 51,250లు ఉంటుందని, ఈ సిలిండర్లను తదుపరి చర్యల కోసం జిల్లా సివిల్ సప్లైస్ అధికారులకు అప్పగించబడినట్లు అధికారులు తెలిపారు. హోటళ్లు, దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు గృహ అవసరాలకు వినియోగించే డోమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించకూడదని అధికారులు హెచ్చరి ంచారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సిఐలు నరసింహారావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కోడూరు పాత మత్స్యకార పాలెంలో శ్రీ వెంకటేశ్వర స్వామి రథానికి ఘన స్వాగతం

తోటపల్లి గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త: మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మత్స్యకార గ్రామాలలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన శ్రీ వెంకటేశ్వర స్వామి రథం ఆదివారం కోడూరు పాత మత్స్యకార పాలెం గ్రామానికి చేరుకుంది. స్వామివారి రథం గ్రామానికి రావడంతో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హారతులు పట్టి, కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మత్స్యకార సంక్షేమ సమితి ప్రతినిధులకు, టీటీడీ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్వామివారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు చంచంగారి రమేష్, జిల్లా మండల అధ్యక్షులు కంజి సుధాకర్, గ్రామ కాపులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత సమాజం కోసం పాటు పడదాం

కోవూరు, మార్చి 15, ప్రభాతవార్త : భారతదేశ మహిళలు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ఒకటన్నారు కోవూరు ఎమ్మెల్యే, టిటిడి పాలక మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్ లోని పద్మావతి ఆడిటోరియంలో బ్రెస్ట్ ఇమేజింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ సెమినార్ లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాటా ్లడుతూ గ్రామీణ ప్రాంత మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన

కల్పించాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. వైద్యం కన్నా నివారణే మిన్న అనే నినాదాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లా లని ఆమె సూచించారు. సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మహిళలు క్యాన్సర్ లక్షణాలను సకాలంలో గుర్తించలేక పోతున్నారని తత్ ఫలితంగా 50% శాతానికి పైగా మహిళలు వ్యాధి ముదిరి తీవ్ర స్థాయికి చేరిన దశలో గుర్తిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్ ప్రాణాంతకం అయినప్పటికీ ప్రాథమిక దశలోనే గుర్తిస్తే 90% శాతానికి పైగా కేసులను చికిత్స ద్వారా నయం చేయవచ్చని ఆమె స్పష్టం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, ఆశా కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తల వంటి క్షేత్ర స్థాయి ఆరోగ్య కార్యకర్తలను సమన్వయం చేసుకొని గ్రామీణ మహిళలను చైతన్య పరచాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోరారు. వైద్య రంగంలో ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డిజిటల్ మమోగ్రఫీ వంటి విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఇవి అత్యంత ఖచ్చితత్వంతో క్యాన్సర్‌ను గుర్తించగలవని ఆమె తెలిపారు. ఈ ఆధునిక సాంకేతికత కేవలం నగరాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలలోని పేద మహిళలకు కూడా అందుబాటులోకి వచ్చే విధంగా కృషి చేయాలని ఆమె సూచించారు. స్విమ్స్ వైద్యుల సహకారంతో కోవూరు నియోజకవర్గంలో రెండు నెలల పాటు పింక్ బస్సు ద్వారా 35 ఏళ్లు పైబడ్డ మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించి కొందరు మహిళలలో ప్రాథమిక దశలోనే బెస్ట్ క్యాన్సర్ ను గుర్తించిన తమ అనుభవాలను ఆమె వివరించారు. భవిష్యత్తులో టీటీడీ, ప్రభుత్వ మద్దతుతో మరిన్ని మొబైల్ క్యాన్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసి ప్రతి మహిళకు ముందస్తు గుర్తింపు పరీక్షలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. వైద్య శాస్త్రం అనేది కేవలం పరిశోధనా పత్రాలకే పరిమితం కాకుండా సామాన్యుడి ప్రాణాన్ని కాపాడే ఆయుధంగా మారాలని ఆమె వైద్యులను కోరారు. మనందరి అంతిమ లక్ష్యం "క్యాన్సర్ రహిత భారతదేశం" కావాలని ఆమె ఆకాంక్షించారు. రేడియాలజీ డిపార్ట్మెంట్ కు చెందిన పలువురు ప్రొఫెసర్లు, డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆంగ్లభాషబోధన తరగతులు

నెల్లూరు, మార్చి 15, ప్రభాతవార్త-విద్య జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్,జిల్లా విద్యాశాఖఅధికారి సహకారంతో 40రోజుల పాటూ ఉచిత ఆన్‌లైన్ ఆంగ్ల బోధన తరగతులను నిర్వహించనున్నారు. ఇందులోభాగంగా ఆదివారం నగరంలోని స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో విల్‌టూకెన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఒక్కరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు, ట్రైనర్ రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతు ప్రభుత్వపాఠశాలల్లో చదివేప్రతి విద్యార్థి తెలుగు మాట్లాడినంత అనర్గలంగా ఇంగ్లీషును కూడా మాట్లాడేలా చేయటమే తమ ధ్యేయమన్నారు.ఉపాధ్యాయులు శ్రద్ధగా ఇక్కడికి రావటం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే 33జిల్లాల్లో 53వేలందికి ఈ శిక్షణ పూర్తిచేయటం జరిగిందన్నారు. ప్రప్రదమంగా విశాఖ,అన్నమయ్య జిల్లాల్లో విధ్యాశాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశామన్నారు. ప్రస్తుతం నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని ఇందుకోసం తమకు సహకరించిన విద్యాశాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు గుడ్లు పంపిణి

గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనం నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఒగ్గు భాస్కర్ దాతృత్వంలో ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణి చేసారు. ఈ సందర్భంగా జేవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వికలాంగులకు గత మూడు సంవత్సరాల నుంచి ప్రతి నెల మూడవ ఆదివారం వికలాంగులకు చేయూత నివ్వడం మాకు చాలా ఆత్మ సంతృప్తిని ఇచ్చిందని నేటి ప్రోగ్రామ్‌కి దాతగా వ్యవహరించిన ఒగ్గు భాస్కర్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. ఒక టీవి చానల్ నందు ప్రఖ్యాత జ్యోతిష్కుడు మాట్లాడుతూ టి 20 క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో 99 న్యూజిలాండ్ గెలుస్తుందని జ్యోతిష్యం చెప్పారు. కానీ వారు చెప్పినదానికి వ్యతిరేకంగా ఇండియా గెలిచిందని చెప్పారు. అలాంటి జ్యోతిష్కులను, దొంగ స్వాములను మూఢ నమ్మకాలను నమ్మవద్దని తెలిపారు. మా శక్తి మేరకు సైన్స్ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్ర ప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, రామ మోహన్, పురుషోత్తమరావు, జగదీష్, రజని కాంత్, అరుణ్ కుమార్, పికెవి శర్మ, జానాసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త గూడూరు పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఒకటవ పట్టణ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా.. ఈ నెల 14వ తేదీన శనివారం సాయంత్రం 4.00 గంటల సమయంలో గూడూరు ఏరియా హాస్పిటల్‌కి వచ్చి నా పేరు వెంకటేశ్వర్లు/వెంకటేష్ అని వయసు సుమారు వయస్సు 35 - 40 ఉంటుందని, ఆరోగ్యం బాగాలేదని, గ్యాస్ట్రిక్ సమస్య ఉంది అని చెప్పాడని వైద్యులు తెలిపారు. డాక్టర్ మీ అడ్రస్ ఎక్కడ అని అడగగా నాకు ఎవరు లేరు అని చెప్పాడని తెలిపారు. డాక్టర్ చికిత్స చేస్తుండగా చనిపోయాడని అన్నారు. ఈ వ్యక్తి మృత దేహం గూడూరు ఏరియా హాస్పిటల్ మార్చురీ రూం నందు భద్రపరచి ఉందని, ఆచూకీ తెలిసిన వారు గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

లిటిల్ ఏంజెల్స్‌లో పిటిఎం సమావేశం

- తల్లిదండ్రులకు పలు క్రీడా పోటీలు

గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త గూడూరు పట్టణ సమీపంలోని శారదా నగర్‌లో ఉన్న లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో ఆదివారం బ్యాలెన్స్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. ముందుగా విద్యార్థుల యొక్క విద్య స్థితిగతులపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి భవిష్యత్తులో విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలలో ఏర్పాటు చేసిన వాలీబాల్, బ్యాట్మెంటన్, మ్యాజిక్ కార్డ్స్, త్రోబాల్ వంటి క్రీడా పోటీలలోఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల కరస్పాండెంట్ బుస్సా రెడ్డి శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరెంట్ టీచర్ మీటింగ్ వలన విద్యార్థుల యొక్క స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ముఖ్యపాత్ర పోషించేందుకు ఎంతో సులువుతుందని పేర్కొన్నారు. ఎక్కువ శాతం విద్యార్థులు పాఠశాలలోనే ఉంటారు కాబట్టి వారి యొక్క సత్ప్రవర్తన పై కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ఈ సమావేశం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన వివరించారు. తమ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు గత 35 సంవత్సరాల నుండి నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఆహ్లాదకరంగా భోజనం చేశారు. కళాశాల యాజమాన్యం సుధేష్ణ, దయాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నమశ్శివాయ, హెడ్మాస్టర్ సురేష్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి అండగా ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన

నెల్లూరు క్రైం, మార్చి 15, ప్రభాతవార్త: ఆపదలో ఉన్న పద్మశాలి వర్గీయులను ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన మరో నిరుపేద చేనేత కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచి తమ ఉదారతను చాటుకుంది. నెల్లూరు రూరల్ పరిధిలోని నారాయణ రెడ్డి పేటకు చెందిన చేనేత కార్మికుడు గుండా శ్రీనాథ్ గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఐదేళ్ల క్రితం బైపాస్ సర్జరీ జరిగిన శ్రీనాథ్, ఇప్పుడు పక్షవాతంతో మంచాన పడటంతో ఆయనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన ప్రతినిధులు ఆ కుటుంబానికి ఆదివారం రూ. 90,000లు ఆర్థిక సాయం అందజేశారు. ఇప్పటివరకు సుమారు 21 నిరుపేద పద్మశాలి కుటుంబాలను ఆపదలో ఆదుకున్నట్లు వారు తెలిపారు.

- యువసేన సేవలు అభినందనీయం: ఆప్కో మాజీ ఛైర్మన్ గత నాలుగేళ్లుగా పేదవారిని ఆదుకోవడంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యువసేన చూపుతున్న చొరవను ఆప్కో మాజీ ఛైర్మన్ గంజి చిరంజీవి ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని, యువసేన చేసే ప్రతి మంచి పనికి తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుధవరపు బాలాజీ పద్మశాలి యువసేన రాష్ట్ర ప్రతినిధులు గోలి వంశీకృష్ణ, పెనుగొండ శ్రీనివాసరావు, మునగపాటి రమేష్, బొద్దు శ్రీనివాసరావు, జింకా దివ్యనారాయణ, జిల్లా ప్రతినిధులు మాగం వెంకటేశ్వర్లు, కారెంపూడి దయాకర్, మునగపాటి వెంకటేశ్వరరావు, చేపూరి శ్రీనివాసకుమార్, ఎంవి సుధాకర్, కె.వి.శేషయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి : కొణతం

తోటపల్లి గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖతో పాటు సోమిరెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ నెల 17వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించ నున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొణతం రఘుబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మనుబోలు గ్రామంలోని సీఆర్ఆర్ కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. వివిధ సంస్థలు పాల్గొనే ఈ మేళాలో వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. తోటపల్లి గూడూరు మండలంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బాటలు వేసు కోవాలని ఆయన కోరారు. సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తూ వారికి ఎంతో ఉపయోగపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

యాష్ పాండ్ లారీల అదుపు తప్పిన దూకుడు..
అనంతపురంలో శిలాఫలకాలు ధ్వంసం

తోటపల్లి గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త: ముత్తుకూరు మండలంలోని ఏపీ జెన్కో సమీప ప్రాంతం నుంచి యాష్ పాండ్ బల్కర్ల ద్వారా రవాణా జరుగుతున్న లారీల నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా శనివారం రాత్రి తోటపల్లి గూడూరు మండలం అనంతపురం గ్రామంలో ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన ఒక లారీ అదుపుతప్పి గ్రామంలోకి దూసుకెళ్లడంతో వైయస్సార్సీపీకి చెందిన శిలాఫలకాలు ధ్వంసమయ్యాయి. అదే సమయంలో మరో లారీ సమీపంలోని ఒక దుకాణంలోకి దూసుకెళ్లడంతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం నెలకొంది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే వైయస్సార్సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక నేత ఉప్పల శంకరయ్య గౌడ్ గ్రామస్తులతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ యాష్ పాండ్ బల్కర్ల రవాణా కోసం కంపెనీ యాజమాన్యం స్థానిక పరిస్థితులు తెలియని హిందీ మాట్లాడే డ్రైవర్లను నియమించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గ్రామాల్లోకి భారీ లారీలు వేగంగా రావడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి యాష్ పాండ్ బల్కర్ల రవాణాపై నియంత్రణ విధించి, భద్రతా చర్యలు చేపట్టి ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన వారికి తగిన పరిహారం అందించాలని కోరారు. శంకరయ్య గౌడ్ వెంట ఉప్పల అమర్, మల్లి తదితరులు ఉన్నారు.

కోటలో వయోజనులకు ఫైనల్ పరీక్షలు

కోట, మార్చి 15 ప్రభాతవార్త సంపూర్ణ అక్షరాస్యత సాధన కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం వయోజనులకు కోట మండలంలో ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. 194 సెంటర్లలో 2,774 మంది వయోజనులు ఈ పరీక్షలు రాసినట్లు ఎపిఎం అనిల చెప్పారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు సుధాకరరావు

పొదలకూరు, మార్చి 15, ప్రభాతవార్త మండలంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల బి.చెర్లోపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం.సుధాకర రావు, ఎం. వి. రావు ఫౌండేషన్, విద్యానగర్ వారి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఉగాది పురస్కారం అందుకున్నారు. తను పనిచేసిన పాఠశాలలో అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడ్డారు. వివిధ పోటీపరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో ఆయన ముందంజలో ఉండేవారు. విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధన చేయుటకు బోధన అభ్యాసన సామాగ్రి ద్వారా, ఆట,పాటల ద్వారా, కృత్యాల ద్వారా ప్రాజెక్ట్ లద్వారా, క్విజ్‌ల ద్వారా, విద్యార్థి కేంద్రీకృత విధానం ద్వారా, క్షేత్ర పర్యటనల ద్వారా బోధన చేశారు.వినూతన బోధన పద్ధతులలో భాగంగా కంప్యూటర్, గూగుల్, యూట్యూబ్, గూగుల్ ట్రాన్స్‌లేటర్, డిక్షనరీ యాప్‌లను ఉపయోగించి బోధన చేశారు. ప్రతిరోజు బడికి రాని పిల్లలను వాళ్ళ ఇంటికి వెళ్లి బడికి తీసు కొని వస్తారు. మండలంలోని మూడు పాఠశాలల విద్యార్థులకు విద్యా సామాగ్రి తన సొంత నిధులతో ఇచ్చారు. జడ్పిహెచ్ఎస్ పొదలకూరు 10వ తరగతి చదువుతున్న 32మంది విద్యార్థులకు యుటిఎఫ్ టెస్ట్ పేపర్స్ తన సొంత నిధులతో ఇచ్చారు. తను పనిచేస్తున్న పాఠశాలకు 11 మంది దేశ నాయకుల ఫోటోలు, 2 కుర్చీలు, బోధన అభ్యాసన సామాగ్రి పెట్టెను బహుకరించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటారు. బి. చెర్లోపల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం ను తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. నెల్లూరు లోని హరిత వృద్ధాశ్రమం, విశ్వభారతి అంధుల పాఠశాలలో పండ్లు పంపిణీ చేశారు. పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఎం.వి. రావు ఫౌండేషన్ వారి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం 2026 అందుకున్నారు. శ్రీపతి చారిటబుల్ ట్రస్ట్ తిరుపతి వారు జాతీయ ఉత్తమ సేవా రత్న అవార్డు 2026 అందుకున్నారు. వీరి సేవలను గుర్తించి ఎం.వి. రావు ఫౌండేషన్ ఛైర్మన్ ఎం. లీలా మోహన్ కృష్ణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఉగాది పురస్కారం 2026కు ఎంపిక చేసి, మార్చి 15వ తేదీ ఆదివారం కోటలోని షాదీ మంజిల్‌లో జరిగిన జాతీయ ఉగాది పురస్కారాలు కార్యక్రమంలో ఎం.వి. రావు ఫౌండేషన్ ఛైర్మన్ ఎం. లీలా మోహన్ కృష్ణ దంపతులు చేతుల మీదగా సన్మానం చేసి పురస్కారం ప్రధానం చేసారు. ఈ పురస్కారం తీసుకున్న ఉపాధ్యాయుడు సుధాకర రావును గ్రామస్తులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

- మండలంలో 397 మంది విద్యార్థులు హాజరు

తోటపల్లి గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మొత్తం 397 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు వేణుగోపాల్ రెడ్డి, జైరామ నాయుడు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. పరీక్షల కోసం మండలంలో మూ డు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్న చెరుకూరు జడ్పీ హైస్కూల్ కేంద్రంలో 70 మంది, తోటపల్లి గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ కేంద్రంలో 135 మంది, చెన్నపల్లిపాలెం జడ్పీ హైస్కూల్ కేంద్రంలో 192 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓ వెల్లడించారు. టైం టేబుల్ ప్రకారం మార్చి 16న ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఎ) పేపర్-1 (70 మార్కులు), మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్ (100 మార్కులు), మార్చి 21న ఇంగ్లీష్ (100 మార్కులు), మార్చి 23న మ్యాథమెటిక్స్ (100 మార్కులు), మార్చి 25న ఫిజికల్ సైన్స్ (50 మార్కులు), మార్చి 28న బయాలజికల్ సైన్స్ (50 మార్కులు), మార్చి 30న సోషల్ స్టడీస్ (100 మార్కులు), మార్చి 31న ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్స్ (30 మార్కులు) పరీక్షలు జరుగుతాయి. అలాగే ఓఎస్ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) పరీక్ష మార్చి 31న, పేపర్-2 పరీక్ష ఏప్రిల్ 1న నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షలు ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం క్రమబద్ధంగా నిర్వహిస్తామని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

ఏఎస్‌పేటలో ఆటో కార్మికులకు రంజాన్‌తోఫా పంపిణీ

అనుమసముద్రంపేట, మార్చి15, ప్రభాతవార్త: మండలకేంద్రమైన ఏఎస్‌పేటలోని 80మంది ఆటో కార్మికులకు మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సందాని బాషా ఆదివారం రంజాన్‌తోఫాను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా తోటి ఆటో కార్మికుడిలా ఆటో కార్మికులందరితో కలసి తన జీవితం కూడా ఆటో కార్మికునితోనే ప్రారంభమైందని, మండలంలో ఇప్పటికీ తన పేరు ఆటో సందాని అంటే అందరికి తెలుసునన్నారు. అందుకే తన సొంత నిధులతో సమకూర్చిన రంజాన్‌తోఫాను 80మంది ఆటో కార్మికులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో పండుగ జరుపుకునేందుకు తనవంతు సహకారంగా రంజాన్‌తోఫా అందజేశానన్నారు. పేదలకు రంజాన్ మాసంలో తనవంతు సహాయ సహకారాలు అందిస్తే అదే తనకు నిజమైన రాంజన్ సంతోషాన్ని ఇస్తుందన్నారు. రంజాన్ రోజున ప్రతి ఒక్కరూ ఆ టోకెన్ ఇచ్చి చికెన్ షాపుల్లో చికెన్ తీసుకోవాలని ఆయన ఆటో కార్మికులకు తెలిపారు. రాబోయే రోజుల్లో తనవంతు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేద తరగతి ప్రజలకు అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆయనతోపాటు ఏఎస్‌పేట స్థానిక ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

కాకర్ల వారి చారిటబుల్ ట్రస్టు తరుపున పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

ఉదయగిరి, మార్చి 15, ప్రభాతవార్త ఉదయగిరి మండల పరిధిలోని పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్టు తరుపున ఆదివారం ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారులైన తోట శ్రీనివాసులు, టి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉదయగిరి, ఏపీఆర్ఎస్ గండిపాలెం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆయా పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి ఉదయగిరి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి తుమ్మల కిరణ్ ఆధ్వర్యంలో 331 మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్, మెసెంజర్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్- అక్షరాంధ్ర పరీక్షల పర్యవేక్షణ

వింజమూరు, మార్చి 15, ప్రభాతవార్త మండల వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఉల్లాస్ - అక్షరాంధ్ర పరీక్షలను ఆదివారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. వయోజన విద్య పర్యవేక్షకులు బోడెపూడి రాంబాబు, వింజమూరు ఎంఎండీవో శ్రీనివాసులు రెడ్డితో కలిసి మండ లంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు అభ్యాసకుల హాజరు శాతాన్ని, పరీక్షలు జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. కేంద్రాలలో అభ్యాసకులకు కల్పించిన వసతుల పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వయోజన విద్య పర్యవేక్షకులు బోడెపూడి రాంబాబు మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పరీక్షలు పూర్తయిన వెంటనే నిబంధనల ప్రకారం మార్కులను ఆన్‌లైన్ చేయాలని, ఈ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు, విద్యాశాఖ సిబ్బంది, అభ్యాసకులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర పరీక్షా కేంద్రం తనిఖీ

బిట్రగుంట మార్చి 15 ప్రభాతవార్త బోగో లు మండలం నాగులవరం గ్రామం లోని ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహిం చిన అక్షర ఆంధ్ర పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు

వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర పరిశీలకులుగా కోటేశ్వరరావు

కోట, మార్చి 15 ప్రభాతవార్త నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర పరిశీలకులుగా డాక్టర్ టి.కోటేశ్వరరావును ఎంపిక చేశారు. గతంలో కూడా కోటేశ్వరరావు నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషర్ పరిశీలకులుగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించి రెండోసారి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చింతా విజయప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

నేటి నుంచి రైతన్న మీ కోసం

కోట, మార్చి 15 ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతన్న మీ కోసం సంక్షేమ కార్యక్రమాలను సోమవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు కోట మండలంలో నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ చెప్పారు. ఆదివారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, రెవెన్యూ, మత్స్యశాఖ, సచివాలయ సిబ్బంది రోజుకు 90 మంది రైతులను కలుస్తారన్నారు. గ్రామస్థాయిలో అధికారులు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్రప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి వారికి కరపత్రాలు పంపిణీ చేస్తారన్నారు. ప్రతి రైతు మొబైల్‌లో ఏపీ ఎయిమ్స్ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. రైతులు పండించే పంటకు సోకే చీడపీడలు, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ రేట్లు, ఈ-పంట నమోదు తదితర సమాచారం తెలుసుకునే విధంగా యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులందరు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా సీఎం సందేశం వివరిస్తారన్నారు.

ఉదయగిరిలో రోడ్డుపై మురుగునీరు.. ఇలాగైతే ఎలా..?

ఉదయగిరి, మార్చి 15, ప్రభాతవార్త మండల కేంద్రమైన ఉదయగిరిలోని శుద్ధ భావి వీధులో మురుగు కాలువ లేకపోవడంతో నివాసాలలో నుంచి వృధా నీరు రహదారిపై ప్రవహిస్తుంది. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతుంది. ఆ రహదారిపై రాకపోకలు సాగించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్ల నుంచి ఇదే పరిస్థితి నెలకొన్న పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించి మా కష్టాలు తీర్చాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

జి.చెర్లోపల్లిలో జనసేన జెండా ఆవిష్కరణ

ఉదయగిరి, మార్చి 15, ప్రభాతవార్త ఉదయగిరి మండల పరిధిలోని జి.చెర్లోపల్లిలో ఆదివారం జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి ఉదయగిరి నియోజకవర్గ నాయకులు కర్ర కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో అల్లూరి రవీంద్ర ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు కల్లూరు సురేందర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జనసేన జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన పేదల పట్ల అలుపెరగని పోరాటం చేసే నాయకులని కొనియాడారు. జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పిల్లలకి పంచి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, జనసేన నాయకులు ఆల నాగేష్, కర్ర సునీల్, మురళి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దగదర్తి పీహెచ్‌సీ పరిధిలోకి మూడు గ్రామాలు

దగదర్తి, మార్చి15, ప్రభాతవార్త దగదర్తి పీహెచ్‌సీ పరిధిలోకి ఊచగుంటపాలెం, వేలిపోడు, ఉలవపాళ్ళ గ్రామాలు టీబీ ముక్తి పంచాయతీలుగా తీసుకోవడమైందని డాక్టర్ అఖిల తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ మూడు గ్రామాలు దగదర్తి పీహెచ్‌సీ పరిధిలోకి కలపడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

బిఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ

బిట్రగుంట మార్చి 15 ప్రభాతవార్త రంజాన్ పండుగ సందర్భంగా పలు ముస్లిమ్స్ పేద కుటుంబాలకు ఆదివారం రంజాన్ తోఫా బిఎంఆర్ యువసేన అధ్యక్షులు సమీవుల్లా ఆధ్వర్యంలో రైల్వే ఇన్స్టిట్యూట్ కార్యదర్శి మామిడి మల్లికార్జున రావు అందించడం జరిగినది. ఈ సందర్భంగా సమీవుల్లా మాట్లాడుతూ రైల్వే ఇన్స్టిట్యూట్ సెక్రటరీ మల్లికార్జున కుల మత భేదం లేకుండా గత 15 సంవత్సరాల నుంచి ఇవే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు అని చెప్పారు.మల్లికార్జున ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు ఎస్.కె .నవీద్. ఎస్.కె. ఖజా రసూల్ ఎస్.కె. నౌషాద్. అమీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లారీలపై తనిఖీ కేంద్రాల "దోపిడీ" డ్రైవర్ల వద్ద వసూళ్ల పర్వం!

కొడవలూరు, మార్చి 15, ప్రభాతవార్త : మండల కేంద్రంలో,నార్త్ రాజుపాలెం, జాతీయ రహదారిపై ఉన్నచెక్పోస్ట వద్ద. .కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రవాణా చేసే లారీ డ్రైవర్ల వద్ద సిబ్బంది అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వే బిల్లులు, అన్ని అనుమతులు ఉన్నప్పటికీ, లారీ పర్మిట్కు అదనపు డబ్బులు డిమాండ్ చేస్తూ గంటల తరబడి లారీలను నిలిపివేస్తున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని పత్రాలు ఉన్నా క్లియరెన్స్ ఇవ్వడం లేదు, ఒక్కో లారీకి రూ.5001000 వరకు అడుగుతున్నారని డ్రైవర్లు ఆవేదన,తీసుకెళ్లకపోతే ధాన్యం పాడవుతుందని డ్రైవర్లు వాంగ్మూలం. అధికారుల నిర్లక్ష్యం: ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతోనే తనిఖీ సిబ్బంది, ఇతర సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు.ఈ అక్రమ వసూళ్లపై జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని లారీడ్రైవర్ల యాజమాన్యం,రైతులు కోరుతున్నారు.

నేడు ప్రజల నుంచి అర్జీల స్వీకరణ నిర్వహణ : తహశీల్దార్

కొడవలూరు,మార్చి15 ప్రభాతవార్త: మండల ప్రజల కోసం తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహశీల్దార్ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేదికలో అన్ని శాఖల అధికారులు, గ్రామాల వీఆర్వోలు హాజరవుతారు. ప్రజలు పా ల్గొని రెవెన్యూ, పెన్షన్లు, ఇళ్లస్థలాలు ఫిర్యాదులు స్వచ్ఛందంగా తెలుపుకోవచ్చని తదు పరి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను నేరుగా విని, పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు

కోవూరు, మార్చి 15 ప్రభాతవార్త : కోవూరు మండలంలో 6 ప్రధాన కేంద్రాల్లో సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు దీనికి సంబంధించి పరీక్షల అధికారులు అన్ని ఏర్పాట్లు కూడా పూర్తిచేశారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాల వశిష్ట ఆంగ్ల మాధ్యమ పాఠశాల, సెయింట్ పాల్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో , న్యూలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో ఈ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు నిర్వహించే సమయంలో ఈ 6కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉండేలా పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు కూడా తీసుకోవడం జరిగింది. అదేవిధంగా పరీక్షా కేంద్రాలకు ఎటువంటి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకూడదని ఈ మేరకు జిల్లా అధికారుల నుంచి పరీక్షా అధికారులకు ఆదేశాలు కూడా వచ్చాయి. ప్రతి పరీక్ష కేంద్ర ప్రాంగణంలో వైద్య ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా సరఫరా చేసేలా అధికారులు చర్యలు కూడా తీసుకున్నారు.

10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ : అనం అరుణమ్మ

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 15, ప్రభాతవార్త రేపటి నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు హాజరగు విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ ఆల్ ది బెస్ట్ తెలియజేసారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు జరగనున్న పదవ తంగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు 174 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారని, 28,589 విద్యార్థినీ విద్యార్థులు హాజరు అవుతున్నారని తెలియజేశారు. జిల్లా విద్యాశాఖ వారు పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. విద్యార్థులు పరీక్షా నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పరీక్షా కేంద్రాలకు సమయానికి హాజరు కావాలని, వారి తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలని సూచించారు. ఈ పరీక్షల కోసం విద్యార్థినీ విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని పరీక్షలకు హాజరుకావాలని, వారి బంగారు భవిష్యత్తుకు మార్గం ఏర్పరచుకొని, వారి తల్లిదండ్రుల ఆశలను నిలపాలని, పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ ఆల్ ది బెస్ట్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్ఓ ప్రారంభం

కోట, మార్చి 15 ప్రభాతవార్త కోట ఆర్టీసీ బస్టాండులో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రారంభించారు. బీద మస్తాన్‌రావు ట్రస్టు దాతృత్వంతో ఈ ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా 20 డస్ట్‌బిన్లను కూడా పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు యూనిఫాంలు కూడా అందజేశారు. దుగరాజపట్నం, నెల్లూరు ఎక్స్‌ట్రా సర్వీసును జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పెంచలయ్య, సూపర్‌వైజర్లు రఘురామయ్య, రాజయ్య, నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

దళితులు ముస్లింల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఆర్.పి.ఐ

నెల్లూరు కార్పొరేషన్, మార్చి 15, ప్రభాతవార్త : ఆర్ పి ఐ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా కార్యాలయం నందు జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాపు రంగరావు, నాయకులు బత్తల మధు ,దుంపల సుబ్బారావు, చిట్టేటి శ్రీనివాసులు వాటంబేడి నాగేంద్ర, ముసలి జయరాజ్, పార్టీ నాయకులు అందరూ ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఆ విందుకు ముఖ్య అతిథిగా ఆర్‌పిఐ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్ కె మాబు పాల్గొ న్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాబు మాట్లాడుతూ మనం సాధారణంగా ఎన్నో ఇఫ్తార్ విందులు చూసి ఉంటాం. ముస్లిం మైనార్టీలు ఇఫ్తార్ విందు నిర్వహించి ఆనవాయితీగా ఇతర రాజకీయ పార్టీ వారిని , ఎంపీ ,ఎమ్మెల్యేలను , మినిస్టర్ , ఒక సెలబ్రిటీనో విందుకు పిలుస్తారన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ పెట్టిన ఆర్ పి ఐ పార్టీలో నాయకులు నా దళిత సోదరులు ఇఫ్తార్ విందు నిర్వహించి నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం నాకు ఎంతో సంతోషం ఉందని చెప్పారు. నేను ఏదో సాధించేసాను అని గర్వంగా ఉందన్నారు. మనమందరం ఇలానే కలిసి మెలిసి ఉంటే ఏమైనా సాధించ వచ్చుఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు కొప్పోలు ప్రమీల, హార్దిక బేగం, స్వప్న, ప్రశాంత్ గౌడ్, వెంక టేష్ , బాబురావు, పి. ప్రకాష్ యాదవ్, వల్లం నాగ సందీప్, అశోక్ ,సుజిత్ రమేష్, మీర్జా ఆలీ, బెల్లం కొండ ధనుంజయ ,తూపిలి వంశీకృష్ణ ,ఉప్పల మాలకొండయ్య, దక్కా చిరంజీవి, ముస్లిం మత గురువు ఇలియాస్ మోలానా పాల్గొన్నారు

మన ఊరి బడిని కాపాడుకుందాం పోస్టర్ ఆవిష్కరణ

కావలి, మార్చి 15, ప్రభాతవార్త : యు.టి.ఎఫ్ కావలి రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సాయి డిగ్రీ కళాశాల నందు ఆదివారం మన ఊరి బడిని కాపాడుకుందాం పోస్టర్ని ఆవిష్కరించడం జరిగింది. యు.టీ.ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజీబ్ అహమద్, వేణుగోపాల్‌ల సౌజన్యంలో జరిగిన సమా వేశానికి అతిధులుగా జిల్లా కార్యదర్శి ఐ.హెచ్.ఎల్ ప్రసాద్, రాష్ట్ర అడిట్ కమిటీ సభ్యులు బి.శ్రీదేవి పా ల్గొని మాట్లాడారు. ప్రభుత్వ బడులను పరిరక్షించి బలోపేతం చేయడమే యుటి.ఎఫ్ లక్ష్యమన్నారు.బడి ఈడు పిల్లందరిని బడిలో చేర్పించేందుకు యు.టి.ఎఫ్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముజీబ్ అహ్మద్, వేణుగోపాల్, రాజరాజేశ్వరి, మాజీ జిల్లా కార్యదర్శి పి. మాధవ,జెవివి అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన బాలబాలికలు విద్యనభ్యసించే ప్రభుత్వ బులను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు.సమాజ శ్రేయస్సుగాభావించి యు.టి.ఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులుఈ గురుతర బాధ్యతను విజయ వంతం చేయాలని అకాంక్షించారు. యు.టి.ఎఫ్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లీంలకు రంజాన్ తోఫా పంపిణీ చేసిన అమర

కావలి, మార్చి 15, ప్రభాతవార్త : పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కావలి పట్టణంలోని 33వ వార్డులోని ముస్లీం కుటుంబాలకు వార్డు మాజీ కౌన్సిలర్, మాజీ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా తన స్వియ నిధులతో రంజాన్ తోఫా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్బంగా అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా మాట్లడుతూ గత కోన్ని సంవత్సరాలుగా వార్డులోని ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేస్తున్నట్లు చెప్పారు. అందులో బాగంగా ఈ సంవత్సరం కూడా రంజాన్ తోఫా అందజేయడం సంతోషంగా వుందన్నారు. రంజాన్ తోఫా అందుకున్న ముస్లీం కుటుంబ సభ్యులు అమర వేదగిరికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు పట్నం శివకుమార్, భువనాసి వెంకటేశ్వర రావు, కాసా విజయ్, వెలుగురు ఈశ్వర్ నవీన్ కుమార్, గురుజాల రవి, గుర్రం వల్లభ తదితర నాయకులు పాల్గొన్నారు.

అభం.. శుభం.. తెలియని చిన్నారులకు అవస్థలు!
శిథిలావస్థ భవనంలో విద్య బోధన

కొడవలూరు, మార్చి15 ప్రభాతవార్త: మండలంలోని నార్త్ రాజుపాలెం పరిధి టపాతోపు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన ఈ భవనం, నిధుల మంజూరులో జాప్యం లేదా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల అసంపూర్తిగా మిగిలిపోయింది.ప్రస్తుతం పాత, శిథిలావస్థకు చేరిన గదుల్లోనే 45 మంది విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త భవనం పునాదులతో, పిల్లర్లతో దర్శనమిస్తుంటే, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో ఈ భవనం మరింత ప్రమాదకరంగా మారుతుందని, ఇప్పటికైనా సంబంధిత ఇంజనీరింగ్ శాఖ, విద్యాశాఖ అధికారులు స్పందించి, వెంటనే పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నూతన సీఐగా గుత్తి వెంకట్రావు బాధ్యతల స్వీకరణ

పొదలకూరు, మార్చి 15, ప్రభాతవార్త పొదలకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా గుత్తి వెంకట్రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తుళ్ళూరు ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై పొదలకూరుకు సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఏ. శివరామకృష్ణారెడ్డి విఆర్‌కు బదిలీ అయ్యారు. 2004 బ్యాచ్‌కు చెందిన గుత్తి వెంకట్రావు అదే ఏడాది పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో ట్రైనింగ్ ఎస్సైగా తన సేవలను ప్రారంభించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎస్సైగా ఎక్కువ కాలం విధులు నిర్వహించారు. సీఐగా పదోన్నతి పొందిన తర్వాత కందుకూరు, పల్నాడు, తుళ్ళూరు ప్రాంతాల్లో సేవలందించారు. ఎస్సైగా పనిచేసిన కాలంలో నెల్లూరు జిల్లాతో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన వెంట ఎస్సై హనీఫ్ ఉన్నారు.

గ్రామ దేవత అంకమ్మకు పొంగళ్లు

విడవలూరు, మార్చి15ప్రభాతవార్త : గ్రామదేవతగా వెలసియున్న అంకమ్మ తల్లికి ఆదివారం ఉదయం అభిషేకాలు,అర్చన, విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా పూలంకరణ విశేషంగా అలంకరించడంతో అమ్మవారు భక్తులకు కాళికారూపంలో దర్శనమిచ్చారు.మహిళలు అధిక సంఖ్యలో ఆలయం కు చేరుకుని పొంగళ్ళు పొంగించి అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు.రాత్రి ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో భక్తులు అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. భజన భక్తమండలి వారిచే భక్తి గీతాలు ఆలపించారు. ఆలయ అర్చకులు కొర్నగిరి పాల్గొన్నారు.

కలెక్టర్ సందేశం మాకు ప్రేరణ

- "థ్యాంక్యూ కలెక్టర్" కార్డులతో విద్యార్థుల కృతజ్ఞతలు

పొదలకూరు, మార్చి 15, ప్రభాతవార్త పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రోత్సాహక సందేశానికి స్పందిస్తూ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఐఏఎస్ పంపిన శుభాకాంక్షల సందేశాన్ని స్వాగతిస్తూ పొదలకూరు ఎస్సీ బాలికల, బాలుర హాస్టల్స్ విద్యార్థులు, మహ్మదాపురం ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులు, పొదలకూరు ఏఎస్ డబ్ల్యూఓ సుధామణి, వార్డెన్లు తాళ్ళ పార్వతి, ప్రసన్నా భాయ్, దేవ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా థ్యాంక్యూ కలెక్టర్ అనే కార్డులను ఆదివారం ప్రదర్శించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు ఇచ్చిన సందేశం తమకు ఎంతో ప్రేరణనిచ్చిందని విద్యార్థులు తెలిపారు. కలెక్టర్ సూచనలతో మరింత పట్టుదలగా చదివి మంచి మార్కులు సాధించి జిల్లాకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులు, వార్డెన్లు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులపై జిల్లా కలెక్టర్ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదివి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెడతాం అని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త గూడూరు పట్టణం నందు షాదీ మంజిల్ నందు ఆదివారం మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్వర్క్ ఆధ్వర్యంలో 170 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ జరుపుకునేందుకు రంజాన్ కిట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నెట్వర్క్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా నెట్వర్క్ ద్వారా పేద ముస్లింలకు, విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమంలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా పేద కుటుంబాలకు రంజాన్ కిట్లు పంచడం జరిగిందని తెలిపారు. రంజాన్ లో ఇచ్చే జకాత్ పేదల హక్కు అని ప్రతి ముస్లిం తనకు మిగిలిన సొమ్ములో కానీ తన వద్ద ఉన్న బంగారు వెండి వస్తువుల ధరలో రెండున్నర శాతం పేదలకు పంచాలని ఇస్లాంలో నిర్దేశింపబడిందని తెలిపారు. అనంతరం తెలుగుదేశం మైనార్టీ నాయకులు రహీం మాట్లాడుతూ పేదలు సంతోషంగా రంజాన్ జరుపుకోవాలని తోఫా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ఇక నుంచి ఈ తోఫా సాధ్యమైనంత మంది పేదలకు నెట్వర్క్ ద్వారా అందించబడుతుందని తెలిపారు. నెట్వర్క్ అధ్యక్షులు రిటైర్డ్ టీచర్ మహబూబ్ బాషా, ప్రతినిధులు ఎంఈఓ రవూఫ్, రిటైర్డ్ హెడ్ మాస్టర్ షేక్ రఫీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించుకోవాలని ముస్లిం మహిళలను కోరారు. మైనారిటీ నాయకులు అలీ హుస్సేన్, ఓడూరు నాజర్, లలిత మెడికల్స్ యూసుఫ్, గోల్డ్ నాజర్, షేక్ నజీమ్, షఫీ మోలానా, నెట్వర్క్ సెక్రెటరీ షేక్ షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులు పూర్తి చేసుకున్న గూడూరు జిల్లా పోరాటం

గూడూరు, మార్చి 15, ప్రభాతవార్త గూడూరును జిల్లా చేయాలని గత వంద రోజులుగా గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు గూడూరు ప్రజలు తండోపతండాలుగా వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కంకణాల పెంచల్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వనరులు ఉన్న గూడూరును జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల్ నాయుడు, యారం వెంకట సుబ్బయ్య, మంజులమ్మ, బొద్దు వెంకట క్రిష్ణయ్య, బి.ఎం చంద్రశేఖర్, శ్రీగౌరి, మీనా, ఉప్పు రాము, ఎల్లసిరి సుబ్బారెడ్డి, కనగలూరు చంద్రశేఖర్ చిరంజీవి, అళగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో భగ్గుమన్న జనసేన పార్టీ వర్గ విభేదాలు

- ఇరువర్గాల మధ్య ఘర్షణ - కార్యకర్తలను చెదరగొట్టిన పోలీసులు

ఆత్మకూరు, మార్చి 15, ప్రభాతవార్త : జనసేన పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో నియోజ కవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో జనసైని కులు కలిసికట్టుగా అప్పటి వైసిపి ప్రభుత్వంపై ఎన్నో సమస్యలు పై ప్రజలకు అండగా పోరాడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ రాజకీ యా ల్లో వేములపాటి అజయ్‌కుమార్ జోక్యంతో అప్పటి వరకు ఐకమత్యంగా ఉన్న జనసేన పార్టీ రెండు వర్గా లుగా చీలిపోయింది. అప్పటినుండి ఏ కార్యక్రమాన్ని చేపట్టిన ఒక వర్గం హాజరు కాకుండా ఆత్మకూరు జ నసేన పార్టీ వర్గపోరు ఆదివారం ఆత్మకూరు బస్టాండ్ సాక్షిగా ఒక్కసారిగా బయటపడింది. ఆత్మకూరు నియోజకవర్గంలో అజయ్‌కుమార్ కలుగచేసుకున్నప్పటి నుండి జనసేనపార్టీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న నలిశెట్టి శ్రీధర్ వర్గానికి, వేములపాటి వర్గానికి పొసగకపోవడంతో జనసేన పార్టీ నియోజకవర్గంలో రెండు వర్గాలుగా చీలిపోయింది. జనసేన ఉద్యమి సభ్యత్వానికి సంబంధించి తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్‌ను పార్టీ అధిష్టానం నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియ మంచింది. ఈనేపథ్యంలో బొలిశెట్టి శ్రీనివాస్ జిల్లాకు వచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పనిచేయాలని సూచించారు. ఈక్రమంలో ఆత్మకూర ఉనియోజకవర్గానికి వచ్చిన జనసైనికులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ అధిష్టా నం నిర్ణయం ప్రకారం ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఉన్నాడని నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ శ్రీధర్‌తో కలిసి పనిచేయాలని సూచించారు. సాధారణంగా సభ్యత్వ నమోదులో ఎప్పుడూ నెల్లూరు నగరం ముందంజలో ఉండేది. కానీ ఈ ఏడాది జరిగిన ఉద్యమ సభ్యత్వ నమోదులో ఆత్మకూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆ రికార్డును బ్రేక్ చేశారు. గతంలో చేసిన 2514 సభ్యత్వాలను మించి రికార్డు స్థాయిలో 10,200పైగా సభ్యత్వాలను చేసి సరికొత్త రికార్డును నెలకొల్పారు. దీన్ని జీర్ణించుకోలేని ఎపి టిడ్కో చైర్మెన్ వేములపాటి అజయ్‌కుమార్ వర్గీయులు నీచ సంస్కృతికి తెరలేపారు. ఈనేపథ్యంలో వేములపాటి అజయ్‌కుమార్ వర్గం ఆదివారం జనసేనపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆత్మకూరు బస్టాండు వేదికగా చేపట్టారు. ఈకార్యక్రామనికి రాష్ట్ర టిడ్కో చైర్మెన్ వేములపాటి అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ విషయం నలిశెట్టి శ్రీధర్‌కు ఏమాత్రం సమారాం ఇవ్వకుండానే సభను అజయ్ ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న నలిశెట్టి శ్రీధర్ వర్గం సభ్యత్వ నమోదు ప్రాంతానికి వచ్చి గోబ్యాక్ అజయ్ అంటూ నినాదాలు చేస్తూ అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట, తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది దీంతో కొంతమంది కార్యకర్తలకు స్వల్ప గాయాలు కావడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ గంగాధర్, ఎస్ఐ జిలానీ సిబ్బంది సహకారంతో ఇరువర్గాలకు సర్దిచెప్పి గొడవ సద్దుమణిగేలా చేశారు. అయితే ఆది నుంచి ఉన్న తమను కాదని కొత్తగా వచ్చిన వారికి పార్టీ పెద్దలు ఎలా మద్ధతిస్తారంటూ నియోజకవర్గ సీనియర్ జనసేన నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న ఆత్మకూరు నియో జకవర్గంలో వేములపాటి దువ్వూరు ప్రాంతం నుంచి వచ్చి పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా డబ్బులు ఇచ్చి జనాభాని తరలించారు.

కేవలం అజయ్‌కుమార్‌మాత్రమే కాకుండా ఆయన వర్గానికి సంబంధించి నూనె మల్లిఖార్జునయాదవ్, నూనె రికికేష్ యాదవ్, గునుకుల కిషోర్, పవన్ యాదవ్ తదితరులు ఆప్రాంతంలో నానాహంగామా చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి నలిశెట్టి శ్రీధర్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ నియోజకవర్గ జనసేన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ పిలుపుమేరకు నియోజకవర్గంలో 10వేలకు పైగా సభ్యత్వాలు శ్రీధర్ చేసిన విషయాన్ని ఇటీవల మీడియా ద్వారా అందరికి విషయాన్ని తెలిపారు. అయితే అజయ్‌కుమార్ తనవర్గంతో హడావిడిగా ఆది వారం ఆత్మకూరులో జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్‌ను ఆహ్వానించకుండా నియోజకవర్గానికి సంబంధం లోని రాష్ట్ర నాయకుడిని పిలిపించి కార్యక్రమాన్ని నిర్వహించాలని చూడడంతో శ్రీధర్ వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యక్రమాన్ని అడ్డుకోవడం జరిగిందని పలువురు నేతలు పేర్కొన్నారు.ఆది నుంచి వివాస్పదంగా ఉన్న వేములపాటి అజయ్ నియోజకవర్గానికి మళ్ళీ రావడం, శ్రీధర్ వ్యతిరేక వర్గాన్ని ప్రోత్సహిస్తుండడంపై జనసేన పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసే ఆలోచనలో సీనియర్ నాయకులు ఉన్నట్లు సమాచారం. అధిష్టానం ఏం నిర్ణయం తీసుకొనకుండా ఉండిపోవడంతోనే వివాదం రోజురోజుకు పెరిగి పెద్దదవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నెల్లూరు పార్లమెంట్ జనసేనపార్టీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న బొలిశెట్టి ఆత్మకూం శ్రీనివాస్‌కు , ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్‌కు ఏమాత్రం తెలియకుండానే సభ నిర్వహించాలని అనుకోవడం ఎంతవరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు సహకరించాలి

కోవూరు, మార్చి 15 ప్రభాతవార్త : కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం కోవూరు మండలంలోని రైస్ మిల్లర్లతో తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరికోతలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా సకాలంలో మిల్లుకు తీసుకువెళ్లాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లర్లకు సూచించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతిరైస్ మిల్లుకు ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందన్నారు. ఆ అధికారి రైతులతో సమన్వయం చేసుకుని ధాన్యం కొనుగోలు విషయంలో వారికి ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రత్యేకచర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ బాలకోటమ్మ, పడుగుపాడు సొసైటీ సీఈవో గోవర్ధ న్‌రెడ్డి పలు సూచనలుచేశారు. మండలంలోని రైస్‌మిల్లు యాజమానులు, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌కు సంక్షేమ విద్యార్థుల ధన్యవాదాలు

పాటూరు(కోవూరు,) మార్చి 15 ప్రభాతవార్త : కోవూరులోని పాటూరులో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ సముదాయంలో ఆదివారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు జిల్లా కలెక్టర్ పంపిన సందేశానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారి విజయకుమార్ మాట్లాడుతూ తొలిసారిగా జిల్లా కలెక్టర్ ఒక మంచి సందేశాన్ని ఇస్తూ ఉత్తరాన్ని అన్ని వసతి గృహాల విద్యార్థులకు పంపడం జరిగిందన్నారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ప్రస్తుతం జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, వసతి గృహాలకు, జిల్లాకు మంచి పేరు తేవాలని జిల్లా కలెక్టర్ పాంప్లెట్ రూపంలో విద్యార్థులకు అందజేశారని, ఇందుకు థాంక్యూ కలెక్టర్ సార్ అంటూ విద్యార్థులు కలెక్టర్‌కు ప్రత్యేక కృజత్జతలు తెలిపారన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పోటీలు

కోవూరు, మార్చి 15 ప్రభాతవార్త : కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని మిత్ర సీడ్స్ గోదాము ప్రాంగణంలో ఉగాది పర్వదినం సంద ర్భంగా గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి 58 ఎడ్ల జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఈ పోటీల్లో ఉత్సాహంగా ఎడ్ల జట్లు పాల్గొన్నాయి.

- బహుమతులు ఇవే.. ఈ రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్టుకు కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, బిరదవోలు భాస్కర్‌రెడ్డి, విగ్రహం విష్ణువర్ధన్ సహకారంతో రూ. 50 వేలను , ద్వితీయ బహుమతిగా మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి రూ. 30 వేలు, తృతీయ బహుమతిగా అట్లూరు రామ్‌ప్రసాద్ నాయుడు 20 వేలు, నాల్గవ బహుమతిగా నాగిరెడ్డి కోటారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు చంద్రమోహన్‌రెడ్డి 20 వేలు, ధైవ బహుమతిగా బట్టేపాటి వేణుగోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 10 వేలు, వీటితో పాటు ఐదు బహుముతులు సాధించిన ప్రతి ఎడ్ల జట్టుకు గునుపాటి గౌరీ శంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఎస్‌కే జాఫర్ కప్పులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గునుపాటి తులసీరామిరెడ్డి మెమోరియల్ నిర్వాహక కమిటీ ఈ కార్యక్రమంలో మహిళా బ్యాంక్ సీఈవో గునుపాటి ప్రసాద్‌రెడ్డి, గునుపాటి దయాకర్‌రెడ్డి, మిత్ర సీడ్స్ అధినేత గునుపాటి మిత్రా రెడ్డి ,్ఢి, తదితరులు ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు

కోవూరు, మార్చి 15 ప్రభాతవార్త : జి ల్లాలోని సాంఘిక సంక్షేమ బాలబాలికల వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తూ సోమ వారం నుంచి పరీక్షలకు హాజరవు తున్న విద్యార్థులందరికీ పరీక్షలు బాగా రాయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేకంగా పాంప్లెట్ రూపంలో విద్యార్థులకు సందేశం పంపడం పట్ల జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి శోభారాణి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దీని వలన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం మరింత మెరుగుపడు తుందన్నారు. విద్యార్థులందరూ కలెక్టర్ పంపిన సందేశానికి సంతోషం వ్యక్తం చేస్తూ థాంక్యూ కలెక్టర్ అంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా తప్పదు

కోవూరు, మార్చి 15 ప్రభాతవార్త : కోవూరు సర్కిల్ పరిధిలోని కోవూరు, ఇందుకూరుపేట మండలాల్లో మద్యం సేవించి వాహనాలను నడిపితే భారీస్థాయిలో జరిమానా తప్పదని కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగితే అందుకు బాధ్యత ఎవరు వహిస్తారన్నారు. ఈ కారణంగా బండి నడిపే వారితో పాటు ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు పడతాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా బుద్ధిగా సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. సర్కిల్ పరిధిలోని ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వెంటనే సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. రహదారిలో ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల నివారణకు పూర్తిగా సహకరించాలని కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే ద్విచక్ర వాహన చోదకులు ఎక్కువ శాతం మంది హెల్మెట్ లేకనే ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయన్నారు. ఇప్పటికే ఈ హెల్మెట్‌లపై కోవూరు సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో యువతకు, ఉద్యోగస్తులకు, సచివాలయ మహిళా ఉద్యోగులకు హెల్మెట్ ధారణపై సిబ్బందితో కలిసి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారిలో ప్రయాణించే ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు హెల్మెట్ ధరించి ప్రమాదాలు జరగకుండా వారించుకోవాలని సూచించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం కూడా చట్టరీత్యా నేరమన్నారు. దీని వలన అనేక ప్రమాదాలు కూడా చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎస్సై ముత్యాలరావు ఉన్నారు.

జాతీయ ఉగాది సేవా పురస్కారం అందుకున్న అందే శ్రీనివాసులు

నెల్లూరు,మార్చి15 ప్రభాతవార్త-విద్య నెల్లూరు నగరంలోని ఎస్‌వీఆర్ పాఠశాల కరస్పాండెంట్ అందే శ్రీనివాసులు జాతీయ ఉగాది సేవా పురస్కారాన్ని అందు కున్నారు. ఆది వారం ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరిం చారు .గత 25 సంవత్సరాలుగా విద్యారంగంలో ఉంటూ అనేక మందికి విద్యాబుద్దులు నేర్పించటం, ప్రభుత్వ పాఠశాలల్లో సర స్వతి విగ్రహాలను స్థాపింటం వంటి వినూత్న కార్యక్ర మాల ను అయన చేపట్టారు.10వ తరగతి లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్దులకు పురస్కారాలను అందించారు. ఆయన సేవలను గుర్తించిన ఫౌండేషన్ సభ్యులు ఆయనకు పురస్కారాన్ని అందించి సత్కరించారు.ఎం.లీలామెహన్‌కృష్ణ, చక్రవర్తి, మరళీ, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల ప్రదర్శన లో విజేతలు వీరే

కోవూరు మార్చి 15 ప్రభాతవార్త కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని మిత్రా సీడ్స్ సమీపంలో ఉగాది పర్వదినం సందర్భంగా గుణపాటి తులసినాను మెమొరీల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ యడ్ల ప్రదర్శన పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పోటీలలో మొదటి బహుమతిని బాపట్ల జిల్లా కంకటపాలెం గ్రామానికి చెందిన కొండేటి పద్మ,ఎడ్ల జట్టు కైవశం చేసుకుంది. విజేతకు 50 వేల నగదు భారీ కప్పు అందజేశారు. రెండో బహుమతిని చాముండేశ్వరీ సి ఫుడ్స్ గంగపట్నం ఎడ్ల జట్టు 30000 నగదు బహుమతిని కప్పును కైవసం చేసుకున్నారు. మూడో బహుమతిని గంగపట్నం గ్రామానికి చెందిన పంచాల మోక్షరెడ్డి ఎడ్ల జట్టు 25 వేలు నగదు బహుమతి కప్పును కైవసం చేసుకున్నారు. నాలుగో బహుమతిని ప్రకాశంజిల్లా పందిపాడు గ్రామానికి చెందిన అభయాంజనేయస్వామి ఎడ్ల జట్టు 20000 నగదు బహుమతిని,వెండి కప్పును కైవశం చేసుకున్నారు. ఐదో బహుమతిని బాపట్ల జిల్లా కంకటపాళెం గ్రామానికి చెందిన వంకాయలపాటి నారాయణ ఎడ్ల జట్టు పదివేల రూపాయాలు నగదు కప్పును కైవసం చేసుకున్నారు.